క్లుప్తంగా

విద్యుత్ కనెక్షన్ తొలగింపు



అక్రమంగా వేసిన షెడ్డుకు విద్యుత్ మీటర్ తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్‌పోస్ట్‌లో ఏపీఐఐసీ భూమిలో గొల్లాపురానికి చెందిన టీడీపీ నేత... ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రం వేసి మరీ అక్రమంగా షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీనికి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకొని నందిని మిల్క్ పార్లర్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 15న ''ఎమ్మెల్యే బాలయ్య ఇలాకాలో కబ్జా చిత్రం'' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో పాటు అక్కడున్న మీటర్‌ను తీసివేశారు. అయితే అక్రమంగా నిర్మించిన షెడ్డు మాత్రం ఇంకా తొలగించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. టీడీపీ నేతల ఒత్తిళ్ల కారణంగా షెడ్డు అక్కడే ఉంచేశారంటున్నారు.

'కిలారి' నవలకు బహుమతి


బి.నాగేశు

హిందూపురం: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి ప్రస్తుతం మైసూరు సిల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న హిందూపురం వాసి బి.నాగేశు రాసిన 'కిలారి' నవలకు బహుమతి దక్కింది. అమెరికాలోని సిరికోన సాహితీ సంస్థ ఉగాది నవల పోటీల్లో 'కిలారి' నవలకు రూ.50 వేల నగదు బహుమతిని ప్రకటించింది. గతంలో కూడా నాగేశు రచించిన 'ఏకు దారం బీరప్ప' అనే నవలకు ఎంతో పేరు వచ్చింది. కృష్ణదేవరాయ గ్రంథమాల మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరు రాఘవేంద్రరావు, శౌంరి జయప్రకాష్, ఉమ్మర్ ఫరూక్, కల్లూరు జానకీ రామారావు, సాహితీ మిత్రులు నాగేశుకు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు

హిందూపురం టౌన్: పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాల 23వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఆ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. అలాగే పాఠశాల అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10 సంవత్సరాలు విధులు నిర్వహించిన సిబ్బందిని సన్మానించి, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు సందీప్, సెక్రటరీ నందకుమార్, స్కూల్ డైరెక్టర్లు భారతి శ్రీనివాస్, సత్య, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత కృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ నందిత సందీప్, ఏఓ భాస్కర్, హెచ్‌ఎం గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో వాకింగ్ చేయడానికి వచ్చిన సుబ్బనాయక్ (66) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

సబ్సిడీ దాణాను సద్వినియోగం చేసుకోండి


పశువుల దాణా పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: ప్రభుత్వం అందించే సబ్సిడీ దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖామంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని పశు సంవర్థక కార్యాలయంలో మంగళవారం మంత్రి సబ్సిడీ పశువుల దాణాను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ పశు సంపదను వృద్ధి చేసేందుకు రైతులు కృషి చేయాలన్నారు. మెరుగైన పాల ఉత్పత్తికి దాణా పాత్ర కీలకమన్నారు. దీన్ని గమనించే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు దాణా అందించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పెనుకొండ మండలానికి మొదట విడతగా 197 దాణా ప్యాకెట్లు కేటాయించడం జరిగిందని, రెండో విడతలో మరి కొందరు రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేడీ శుభదాస్, డీడీ గిరిజ, ఏడీ శ్రీరాములు నాయక్, వైద్యులు నాగేంద్ర సిబ్బంది మహేష్, ప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


శిథిలావస్థలో కోమరేపల్లి - మధూడి గ్రామాల మధ్య వంతెన


నరసబుంది-మధూడి గ్రామాల మధ్య ఉన్న వంతెన ఇలా..

శిథిలావస్థలో వంతెనలు

- ఆందోళనలో వాహనదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

అగళి: వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు వాటిపై నుంచి వెళ్లాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. అగళి మండలంలోని మధూడి నుంచి కోమరేపల్లి , అగళి నుంచి ఆర్‌జీ పల్లి, నరసబుంది నుంచి మధుడి గ్రామాలకు వెళ్లే దారుల్లో ఉన్న వంతెనలకు ఏళ్ల తరబడి మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం కొన్నిచోట్ల రెయిలింగ్ పూర్తిగా ధ్వంసం కాగా, కొన్నింటికి రెయిలింగ్ కూడా లేవు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి సువర్ణముఖి వంక ఆర్‌జీ పల్లి నుంచి ఆలూడి మీదుగా ప్రవహిస్తోంది. కోమరేపల్లి గ్రామం వద్ద వంతెన నిర్మించారు. వంతెన నిర్మించి దశాబ్దాలు గడచినా దాన్ని పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఈ మార్గం మీదుగా వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నాయి. దీంతో వాహనదాల ధాటికి వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ ధ్వంసమైంది. ప్రస్తుతానికి రాకపోకలు సాగుతున్నా వంతెన ఎప్పుడు కూలిపోతుందోనన్న స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మిగతా వంతెల పరిస్థితి కూడా ఇలాగే ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రిళ్లు వంతెన మార్జిన్లు కనిపించక దెబ్బతిన ఇనుప రెయిలింగ్ ఢీకొని వాహనదారులు గాయపడుతున్నారు. ఇప్పటికైనా వంతెనల అభివృద్ధికి కూటమి సర్కారు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అగళి-ఆర్‌జీ పల్లి వంతెనకు రెయిలింగ్ లేని దృశ్యం

నూతన వంతెన నిర్మించాలి



కొమరేపల్లి వద్ద వంతెనను చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. వంతెన అడుగు భాగంలో రాళ్లు ఊడిపోతున్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని నూతన వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

– శివరాజు ,కోమరేపల్లి, అగళి మండలం

భయం .. భయంగా ప్రయాణం



ఆర్‌జీ పల్లి వెళ్లే రోడ్డులో అగళి చెరువుకు నీళ్లు వచ్చే కాలువపై వంతెన రెయిలింగ్ లేదు. దీంతో వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో భయం భయంగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని నూతన వంతెన నిర్మించారు.

– శ్రీనివాసులు, రామపురం, అగళి మండలం

'మెగా లోక్ అదాలత్'ను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీజే శైలజ

హిందూపురం: రాజీ మార్గం ద్వారా ఇరువర్గాలు సామరస్యంగా కేసులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానాలు అవకాశాలు కల్పిస్తున్నాయని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. మంగళవారం జిల్లా అదనపు కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి, హరిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, డీఎస్పీ మహేష్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతా న్యాయస్థానాల ఆదేశాల మేరకు జూలై 5న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని ఏడీజే శైలజ కోరారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రాజీ కాదగిన క్రిమినల్ కేసులను సాధ్యమైనంత అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు.

బాలంపల్లిలో 'పొలం పిలుస్తోంది'

హిందూపురం: పొలాల్లోని భూమి సాంద్రతను భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వినియోగంతో పంటల సాగుతో మంచి ఫలితాలు పొందవచ్చని ఏఓ సురేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని చలివెందుల, బాలంపల్లి రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలిస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని నాగళూరు, మావటూరు గ్రామాలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏఓ చందన ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. వేరుశనగ, మొక్కజొన్న పంటల్లో పాటించాల్సిన మెళకువలను వివరించారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిపై దాడి

పెనుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద స్టేషన్‌లో టీ వ్యాపారం చేసుకునే సురేష్ అనే వ్యక్తిపై ముగ్గురు కర్ణాటక వాసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. టీ వ్యాపారం చేసుకునే సురేష్ ఇటీవల కర్ణాటక రాష్ట్రం చెళికేరి సమీపంలోని కోడిపల్లికి చెందిన ఓ యువతికి అసభ్యకరంగా పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ముగ్గురు యువతితో కలసి వచ్చి స్టేషన్ సమీపంలో ఉన్న సురేష్‌ను చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సురేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరు సమీప బంధువులేనని, తాగిన మైకంలో గొడవ చేసుకున్నారని పోలీసులు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న మోడల్ పాఠశాలలో మంగళవారం బదిలీ అయిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించారు. ప్రిన్సిపాల్ ఓబుళపతితో పాటు పది మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువులను సన్మానం చేశారు.

23న అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

మడకశిర: ప్రభుత్వ వృత్తి విద్య అధ్యాపకుల పోస్టులకు ఈనెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ తెలిపారు. కళాశాలలో ఫ్యాషన్ గార్మెంట్స్, డెయిరీ టెక్నాలజీ కోర్సులు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు అభ్యర్థులు బయోడేటాతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

నిర్మాణ పనులు ప్రారంభం

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లిలో శనీశ్వరస్వామి ఆలయం సమీపంలో మరుగు కాలువ నిర్మాణం పనులను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క మంగళవారం ప్రారంభించారు. రూ.15 లక్షల జడ్పీ నిధులతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెనిద్ర

మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పల్లెనిద్ర చేపట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఐదు మండలాలకు కలసి 34 మందికి గాను రూ.14 లక్షలు చెక్కుల రూపంలో అందించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

హిందూపురం టౌన్: పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాండు రంగనాయకులు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జాతరోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

పావగడ: పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద సిద్ధప్ప చావడిలో దొడ్డ కొల్లాపురమ్మ, మారమ్మ, చౌడేశ్వరిదేవి, సొప్పులమ్మ గ్రామ దేవతల జాతరోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవతలను చావడిలో ఏర్పాటు చేసిన పందిరిలో ప్రతిష్ఠించి ఘనంగా పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

టీబీ నివారణపై అవగాహన ర్యాలీ

హిందూపురం: టీబీ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే గళ్ల పరీక్షలు చేయించుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలని టీబీ కంట్రోల్ బేవనహళ్లి పీహెచ్‌సీ డాక్టర్ మంజునాథ్, టీబీ యూనిట్ సూపర్ వైజర్ గౌస్ పీర్ తెలిపారు. టీబీ, ఎయిడ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా మంగళవారం కిరికేర – 1, విటపల్లిలో టీబీ క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పేరుకు మాత్రమే 'డ్రైనేజీ '

పెనుకొండ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిర్మించిన డ్రైనేజ్‌పై నిర్మాణంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ కూటమి నాయకులే ఈ డ్రైనేజ్ నిర్మాణంపై విమర్శలు గుప్పిస్తున్నారు. రూ. 9 లక్షల మున్సిపల్ నిధులతో ఆ కార్యాలయం ఎదురుగా డ్రైనేజీ నిర్మించారు. డ్రైనేజీలో మట్టిని, మురుగునీటిని బయటకు తీయాలంటే కనీసం పార సైతం పట్టదని, ఇలాంటి నిర్మాణాలు ఎందుకు చేపట్టడమని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

సరైన రీతిలో నిర్మించని డ్రైనేజీ కాలువ



హామీలు అమలు చేసే దాకా పోరాటం


రొద్దంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


సోమందేపల్లి: పుస్తక ఆవిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొద్దం: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు ఎస్ నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి అన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు హామీల మోసాలు, అరచకాలను వివరిస్తూ రూపొందించిన 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్టప్ప, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, తిమ్మయ్య, నరేంద్రరెడ్డి, సినిమా నారాయణ, అమీర్, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద 'వెన్నుపోటు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే తల్లికి వందనం నిధులను అరకొరగా అమలు చేశార్నారు. రాబోవు రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్, సర్పంచులు అంజీనాయక్, కిష్టప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు, వెంకటనారాయణ రెడ్డి, కంబాలప్ప, నరసింహ మూర్తి, నాగమణి, ఆదినారాయణరెడ్డి, రమేష్, మంజు జితేంద్ర రెడ్డి, ప్రతాప్, శ్రీరాములు కళ్యాణ్, సాయిరాం, ఇమామ్‌వలి, గోవింద రెడ్డి, నాగప్ప, సురేష్, గంగప్ప తదతరులు పాల్గొన్నారు.

కాబోయే ముఖ్యమంత్రి కుమారస్వామే


మాట్లాడుతున్న నిఖిల్ కుమారస్వామి

పావగడ: కర్ణాటక రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి రైతు పక్షపాతి హెచ్‌డీ కుమారస్వామి అని జేడీఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమార స్వామి అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి కల్యాణ మంటపంలో మంగళవారం నిర్వహించిన జేడీఎస్ కార్యకర్తల సభలో ఆయన మాట్లాడారు. పావగడలో ఈ సారి జేడీఎస్ జెండా ఎగుర వేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. తాలూకా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదు కష్టతరం కాకుండా మిస్డ్ కాల్ ద్వారా అతి సులభంగా సభ్యత్వ నమోదును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు తిమ్మారెడ్డి, ఆర్సీ అంజినప్ప, ఎస్‌ఏ ఈరణ్ణ, బలరామిరెడ్డి, సొగడు వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దండు మారెమ్మ జాతర


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, భక్తులు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 27వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం దండు మారెమ్మ జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మహిళలతో కలిసి బోనాలు ఎత్తుకున్నారు.

తాగునీటి పైప్‌లైన్ లీకేజీ


ఏఓ కార్యాలయం ఆవరణలో వృథా అవుతున్న తాగునీరు

రొళ్ల: మండల కేంద్రంలోని రత్నగిరి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసి మదర్ వాటర్ ప్లాంట్‌కు సరఫరా అవుతున్న తాగునీరు పైప్‌లైన్ పగిలి పోవడంతో నీళ్లు లీకేజీ అవుతున్నాయి. ఏఓ కార్యాయం ఆవరణం నుంచి మదర్ ప్లాంట్‌కు పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్ పగిలి పోయి వారం రోజులుగా నీళ్లు వృథాగా ఎవరూ పట్టించుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో నీటి కొరత పట్టిపీడిస్తోందని, నీటి వృథాను వెంటనే అరికట్టాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ఫైర్ ఆఫీస్ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో పోలీసులు, అధికారులు

హిందూపురం: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎస్పీ మహేష్ తెలిపారు. స్థానిక ఫైర్ స్టేషన్ ఆవరణలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు వెంకటస్వామి, సత్యానారాయణ, శ్రీనివాసులు, రాంప్రసాద్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్థన్, ఆంజనేయులు, కరీంతో పాటు పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


కుళ్లాయప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సానిపల్లి కుళ్లాయప్ప (65) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మంగమ్మ గ్రామాన్ని సందర్శించారు. కుళ్లాయప్ప మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: గ్రామాల్లో యోగాంధ్ర సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వాస్త్రీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో సచివాలయాల సిబ్బంది, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో యోగాంధ్ర సర్వేపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ అక్రమంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం తదితర విద్యా సామగ్రి పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే అనుమతి లేకుండా నడుపుతున్న భాష్యం విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

పావగడ:అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ.42 లక్షల విలువైన 32 ద్విచక్ర వాహనాలు, రూ 1,85,700 విలువైన బంగారు ఆభరణాలు, 2.6 కేజీల వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సీఐ సురేష్ తెలిపారు. తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్, ఏఎస్పీ గోపాల్, డీఎస్పీమంజునాథ్ మార్గ దర్శనంలో చేపట్టిన గాలింపు చర్యల్లో అంతర్రాష్ట్ర దొంగలు పట్టుబడ్డారన్నారు. వీరు అనంతపురం, పావగడ, తుమకూరు, చిక్కబళ్లాపురం పీఎస్‌ల పరిధుల్లోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారని, ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లేవారని పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9494767933, 9912220726